తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ |మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
శనివారం
2 ఆగస్టు 2025
పేజీలు : 08
Follow :

# పేదల సంక్షేమం కోసమే రేషన్ కార్డులు

## మంత్రి సీతక్క

**కొత్తగూడ 1ఆగస్టు (జనంసాక్షి) :** పేదల సంక్షేమం కోసమే రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని నూతన రేషన్ కార్డ్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ 2013 లోని ఆహార భద్రత చట్టం ప్రకారం పేద ప్రజలకు అందరికీ రేషన్ కార్డు అందించాలని సదుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.కొత్తగూడ మండల వ్యాప్తంగా సుమారుగా 649 నూతన రేషన్ కార్డులు అదేవిధంగా 1267 రేషన్ కార్డులను పేర్లు సవరించడం జరిగిందని అన్నారు.స్థానిక సబ్ సెంటర్,మోకాళ్లపల్లి అంగన్వాడీ కేంద్రం ను ఐటీడీఏ పి ఓ చిత్ర మిశ్రా, సిడిపిఓ నీలోఫర్ ఆద్మీ తో ప్రారంభించారు.ఏజెన్సీ ప్రాంతంలోని



నూతనంగా నిర్మించిన బ్రిడ్జి ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం దృష్టిలో ఉంచుకొని వేగంగా పూర్తిచేసి అందించిన కర్ర జనార్దన్ రెడ్డి ని అభినందించారు. ఈ కార్యక్రమం అధికారులు, రూరల్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి,మండల అధ్యక్షులు సారయ్య, బ్లాక్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి,మాజీ ఎంపీపీ విజయ రూప్ సింగ్,మాజీ జడ్పిటిసి పుష్పలత మాజీ సర్పంచ్ రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

**కలెక్టర్ వెంకటేష్**

**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 1( జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని గన్నారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో ఇప్పటి నుంచే 10 వ తరగతి లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని అన్నారు. రక్షిత మంచినీరు అందించాలని, విద్యార్థులకు టాయిలెట్లు, ఇతర సౌకర్యాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంట ప్రధాన ఉపాధ్యాయులు హనుమంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- **ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి**
- **ఆరోగ్య కేంద్రంలో వార్డులు, మందుల నిల్వ రిజిస్టర్లు, తనిఖీలు**
- **ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు**
- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 1 (జనంసాక్షి) :** విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నాడు మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్లో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పాఠశాలలో వంటశాల, మూత్రశాలలు, తరగతి గదులు, ఆహారం నాణ్యత, పరిసరాలు, ఆరోగ్య కేంద్రంలో వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. మిగతా 9లో..



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
- **గణపురంలో పిఎసిఎస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాసిల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ**

**గణపురం, ఆగస్టు01 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం గణపురం మండలంలో ఎస్సి కాలనీ, బుర్రకాయలగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘం ఎరువుల దుకాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆసుపత్రి , తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు, స్టోర్ రూము లుతనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరుగకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మిగతా 9లో..

## సారంగాపూర్‌లో ఘనంగా వన మహోత్సవం



**సారంగాపూర్,ఆగస్టు1(జనంసాక్షి):** వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని,వాటిని సంరక్షించాలని, జిల్లా అటవీ అధికారి శ్రీమతి షేక్ ఆదామ్ నాగిని భాను పిలుపునిచ్చారు. వన మహోత్సవాన్ని సారంగాపూర్ మండలం అడెల్లి పోచమ్మ ఆలయానికి పరిధిలోని పార్క్‌లో శుక్రవారం నిర్వహించగా, ఆవరణలో విద్యార్థులతో కలిసి, మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మాట్లాడుతు ఈ రోజుల్లో అడవుల విస్తీర్ణం తగ్గుతుండడంతో, వాతావరణ కాలుష్యం పెరుగుతుందని,ఆక్సిజన్, పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా, తమ తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.గ్రామాల్లో పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో పండ్ల, పూల మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ గ్రంథాలయ చైర్మన్ అంజుమాన్ అలీ, అడెల్లి ఆలయ చైర్మన్ సింగం భోజాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మాజి జెడ్పిటిసి పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నిర్మల్ అటవీ క్షేత్ర అధికారి జివి రామ కృష్ణారావు, అటవీ క్షేత్ర అధకారి టాస్కోర్స్ వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో భైంసా రాథోడ్ రమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నజీర్ ఖాన్, డివైఆర్ఓ సంతోష్, బీట్ ఆఫీసర్లు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లకు శిక్షణ తరగతులు



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** శ్రీరాంపూ ర్ సింగరేణి వృత్తి శిక్షణ కేంద్రంలో ఏరియాలో పనిచేస్తున్న భూగర్భ, ఉపరితల గనుల వివిధ విభాగాల ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లకు ఏరియా సింగరేణి జిఎం ఎం.శ్రీనివాస్ పన్నెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారం భించడం జరిగింది.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఫ్రంట్ లైన్ సూప ర్వైజర్లుకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి స్ట్రక్చర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ సింగరేణి వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని,అందులో భాగంగా శుక్రవారం ఏరియాలో ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు.సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును రక్షణతో వెలికితీయడానికి ఫ్రంట్ లైన్ సూపర్వై జర్లు చేస్తున్న కృషి అత్యంత విలువైనదని కొనియాడారు.భూగర్భ,ఉపరితల గనులలో ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లు ముందు ఉండి అక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని బొగ్గు వెలికితీత కార్యక్రమాలను మొదలు చేస్తారని, భూగర్భ,ఉపరితల గనులలో ఏమైనా ప్రమాద పరిస్థితులు ఉంటే బొగ్గు వెలి కితీత కార్యక్రమంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ కమురుద్దీన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

- **మయాంక్ సింగ్**



**మల్హర్, ఆగస్టు 01(జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉం చుకోవాలని,ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఓపీ, రిజిస్ట్రే షన్ కౌంటర్, ల్యాబ్, వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు,విధుల్లో ఉన్న సిబ్బంది హాజరును పరి శీలించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అన్ని రకాల మందులు, వాక్సిన్ అందు బాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వారి వెంటతహసీల్దార్ కె రవి కుమార్, వైద్యాధికారి డాక్టర్ రాజు, ఏఎన్ఎంలు, ఉన్నారు.

# పురుషులతో సమానంగా విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలి

- **ఆర్‌బివిఆర్‌ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్త్**



**నస్పూర్ (జనంసాక్షి):** పురుష పోలీసులతో సమానంగా మహిళా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని,ఫంక్షన్ వర్టీకల్స్ లోని అన్ని విధులు చేయాలని ఆర్‌బివిఆర్‌ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు.శుక్రవారం రోజున సిసిసి నస్పూర్ సింగరేణి అతిది గృహంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రామగుండం కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధి లోని డీసీపీ,ఏసీపీ, ఎస్.హెచ్.ఓ మహిళా పోలీస్ అధికారులు,సిబ్బంది తో సమీక్షా సమావేశం నిర్వహిం చారు.అనంతరం డీసీపీ,ఏసీపీ,ఎస్.ఎచ్ ఓ మహిళా పోలీసు సిబ్బందితో డ్యూటీ లు,పోస్టింగ్‌లు,సెలవులు,పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న డ్యూటీల గురించి చర్చించారు.పని చేయు ప్రదేశం లో సమస్యలు,కుటుంబ తరుపున ఏవైనా సమస్యలు ఉన్నవా అని అడిగి తెలుసుకున్నారు.పోలీస్ విధులలో పురుషులు,మహిళా విధులు అని వేరు వేరు లేవు అన్నారు.పోలీస్ శిక్షణ సమయంలో పురుషులతో సమానంగా మహిళలకు శిక్షణ ఉంటుందని అక్కడ అందరు సమానంగా భావి స్తారన్నారు.క్షేత్ర స్థాయి డ్యూటీల విషయంలో అలా చేయడం లేదు అన్నారు.పోలీస్ స్టేషన్ లలో రిసెప్షన్,రికార్డు వర్క్, సిసిటివిఎస్ టెక్ టీమ్,ఇతర పోలీస్ స్టేషన్ లో విధులతో పాటు బయట డ్యూటీ లు కమ్యూనిటీ పోలిసింగ్ ప్రోగ్రాం,బ్లూ క్లోట్స్, నైట్ పెట్రోలింగ్, పిటిషన్ ఎంక్వయిరీ,కోర్ట్ డ్యూటీ,సమాన్స్,మెడికల్ డ్యూటీ, వెహికల్ చెకింగ్,క్రైమ్ డ్యూటీలు,ఎస్కార్ట్ డ్యూటీ,ట్రాఫిక్ డ్యూటీ లు,బందోబస్త్ డ్యూటీలు పురుషులతో సమానంగా విధులు నిర్వహించాలని సూచిం చారు.ఎప్పుడు తప్పకుండ నీట్ టర్న్ అవుట్ మెయింటైన్ చేయాలని, పోలీస్ స్టేషన్‌లో స్కూటీలు ఏర్పాటు చేయాలని,మహిళా సిబ్బందికి డ్రైవింగ్ శిక్షణ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్,ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లా రెడ్డి,మంచిర్యాల జోన్ సీఐ,ఇన్స్పెక్టర్‌లు,ఎస్ఐలు, మహిళ సబ్ ఇన్స్పెక్టర్ లు,మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బలోపేతం

- **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**





**పరకాల, ఆగస్టు 1 (జనంసాక్షి):** మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక వెసులుబాటుతో పాటు, ఆర్టీసీని బలోపేతం చేస్తుందని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.గురువారం పరకాల పట్టణ ఆర్టీసీ బస్టాండ్ లో నాలుగు నూతన ఆర్టీసీ బస్సులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వయంగా బస్సు నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొట్టమొదటి సారిగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్నదని,2023 డిసెంబర్ 9 నుంచి మహాలక్ష్మి పథకం అమల్లోకి రాగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ, కర్ణాటకలో మాత్రమే మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని అందిస్తున్నారని,త్వరలో ఇతర రాష్ట్రా ల్లో కూడా అమలు చేయబోతున్నారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల టికెట్లపై ఉచిత బస్ ప్రయాణాల ద్వారా ఆర్టీసీకి 6వేల కోట్లు లాభం వచ్చిందని తెలిపారు.రాష్ట్రంలోని కోటి మంది మహిళల ను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, క్యాం టీన్లు, ధాన్యం కొనుగోలుకేంద్రాలు, డెయిరీ యూనిట్, ఇతర స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా భరోసా అందిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇం దిరా మహిళాశక్తి పథకంతోమహిళా సంఘాలు బస్‌లు కొనుగోలు ద్వారా ఆర్థికంగా ప్రగతి సాధిస్తుందని అన్నారు.ప్రజా రవాణాకు సంబంధించి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటు ందని, మహిళలకు ఉచిత బస్ ప్రయా ణ సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.త్వరలో పరకాల డిపోకు మరిన్ని బస్‌లు రాబో తున్నాయని,పెరిగిన రద్దీకి అనుగు ణంగా కొత్త బస్సులను కొనుగోలు చేస్తు న్నామని,ఉచిత బస్ ప్రయాణం ద్వారా మహిళలకు ఆర్థిక వెసులు బాటు కలుగుతుంది అన్నారు.

## ఆర్థిక పరిజ్ఞానం అవగాహనతో కుటుంబ అభివృద్ధి



**నెరడిగొండ ఆగస్టు 1(జనంసాక్షి):** బ్యాంకు సేవలను ఉపయోగించుటకై ఆర్థిక పరిజ్ఞానం అవగాహన ఉంటే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని లీడ్ డిస్టిక్ ఆఫీసర్ రాములు తెలిపారు.శుక్రవారం రోజున మండలంలోనియాపాలగూడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ నిర్వహిస్తున్న జన సురక్ష కార్యక్రమానికి లిడ్ డిస్టిక్ ఆఫీసర్ రాములు తోపాటు ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ వంశీ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎల్ఈఓ రాములు మాట్లాడుతూ సంపాదించే డబ్బులను పొదుపుగా వాడుకొని మిగత ఖర్చులను తగ్గించుకుంటే ఆర్థికంగా బలం చేకూరుతుందని వివరించారు.బ్యాంకులు ప్రజల కోసమే ఉన్నాయని ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను ఉపయోగించుకొని ముందుకు సాగాలని అన్నారు.భారతదేశంలోని ప్రతి పౌరుడికి అకౌంటు ఉండాలన్న ఉద్దేశంతో పిఎంజెడివై ఖాతాను బ్యాంకులో ఉచితంగా అందిస్తాయని అన్నారు.ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సామాజిక భద్రత భీమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.సైబర్ క్రైమ్ మోసపూరిత ఫోన్ కాల్స్ కు స్పందించవద్దని అటువంటి కాల్స్ వస్తే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి సిఎఫ్ ఎల్ కౌన్సిలర్ సంతోష్ అరవింద్ ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 72 గంటల మహా నిరాహార దీక్ష



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 01,(జనంసాక్షి):** బీసీల రిజర్వేషన్ కొరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టబోయే 72 గంటల మహా నిరాహార దీక్షను విజయవంతం చేయాలని యునైటెడ్ పూలే ఫ్రెంట్ రాష్ట్ర అధ్యక్షుడు మారన్న అన్నారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ,ఈనెల 4 నుంచి 7 వరకు హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద కవిత 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. .కావున బీసీల కోసం పోరాడుతున్న కవితకు మనమందరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ దీక్షకు నిర్మల్ నుంచి పెద్ద ఎత్తున బీసీలు తరలి రావాలని కోరారు. అనంతరం మహా నిరాహార దీక్ష గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా తెలంగాణ జాగృతి అధ్యక్షుడు లక్ష్మణ చారి, ఓడ్డెర సంఘం అధ్యక్షుడు భూపతి, నాయి బ్రాహ్మణ నాయకులు గంగాధర్, తెలంగాణ జాగృతి నాయకులు, పాల్గొన్నారు.

# వ్యాధుల పట్ల అవగాహన కలిగించి మెరుగైన సేవలు అందించాలి

- ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి





**ఏటూరునాగారం,ఆగష్టు 01(జనంసాక్షి):** సామాజిక ఆరోగ్య కేంద్రం ఏటూరు నాగారంను సీజనల్ డిసీసేస్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి సందర్శించి, సామాజిక ఆరోగ్య కేంద్రం లోని డాక్టర్లు, సిబ్బందినీ ఉద్దేశించి మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజలకు వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ వ్యాధులపట్ల అవగాహనను పెంపొందించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ రాబోయే రెండు మాసాల వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం, ఫీవర్ వార్డ్ లో చికిత్స పొందుతున్న జ్వర బాధితుల ఆరోగ్య పరిస్థితులను వారి కేస్ షీట్ పరిశీలించి, రోగులకు గల ప్లెట్లెట్స్ సంఖ్యను అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి తెలియజేశారు. అనంతరం కేంద్రంలోని ఐసిటిసి సెంటర్‌ను సందర్శించి, హెచ్ఐవి టెస్టుల వివరాలను అడిగి తెలుసుకుని హెచ్ఐవి బాధితులకు మందు లను పంపిణీ చేసి వారికి హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగించాలని సిబ్బంది కి వివరించారు. తర్వాత రక్త నిధి సెంటర్‌ను ప్రసూతి వార్డును సందర్శించి, తల్లులను వారి పిల్లల ఆరోగ్యాన్ని వారికి అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, డిసిహెచ్ ములుగు డాక్టర్ జగదీష్, సూపర్నెంట్ డాక్టర్ సురేష్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్స్ ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి
- అధికారులు పారిశుద్ధ్యం, తాగునీటి, విద్యుత్ సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలి
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి నగర మేయర్ గుండు సుధారాణి,
- కమిషనర్ చాహత్ భాజ్ పాయిలతో కలిసి జిడబ్ల్యూఎంసి పరిధిలోని పరకాల నియోజకవర్గ 15,16,17 డివిజన్ల పురోభివృద్ధిపై సమీక్ష




**వరంగల్ ఎంజీఎం, ఆగష్టు 1(జనంసాక్షి):** పలు పథకాల కింద చేపట్టి కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం బల్దియా లోని మేయర్స్ సమావేశ మందిరంలో ఆయన నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసిజిడబ్ల్యూఎంసి పరిధిలోని పరకాల నియోజకవర్గ 15,16,17 డివిజన్లలో అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్యం నిర్వహణ, మంచినీటి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన పలు సమస్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టాంప్ డ్యూటీ నిధులతో మూడు డివిజన్లో సుమారు 727 లక్షల రూపాయలతో 32 అభివృద్ధి పనులు చేపట్టగా అందులో దాదాపు కోటి రూపాయల వ్యయంతో 18 పనులు పూర్తయినాయని, కోటి రూపాయల వ్యయంతో కొనసాగుతున్న రెండు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ప్రారంభించాలన్నారు.వర్షాకాలం నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగాలని, మురుగు కాలువలలో పూడికలు తీయడంతోపాటు, చెత్త సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్ వేయడం జరగాలన్నారు. డివిజన్లలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ నీటి ప్రెషర్ వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలన్నారు. స్వచ్ఛమైన మంచినీటిని అందించుటకు ట్యాంకులు ఎప్పటికపుడు శుభ్రం చేస్తూ వాటి వివరాలు ఆయా ట్యాంకులపై ప్రదర్శించాలన్నారు. గాడిపల్లిలో మంచినీటి పైప్లైన్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. బల్దియాకు సంబంధించిన వార్డ్ ఆఫీసర్, పారిశుద్ధ్య, మంచినీటి సరఫరా, విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు, బల్దియా టోల్ ఫ్రీ నెంబర్లు మూడు డివిజన్లోని ఈ 11 గ్రామాల కూడలిల గోడలపై ప్రదర్శించాలని, ఏమైనా సమస్య ఉత్పన్నమైతే ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులను సంప్రదించి,పరిష్కరించుకోవచ్చునని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షిస్తూ 404 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించగా అందులో 296 మంది లబ్ధిదారులకు మంజూరు చేయగా, మిగిలిన 108 ఇళ్లను త్వరితంగా లబ్ధిదారులకుఅందజేయాలన్నారు.ధర్మారంలో మహిళల కొరకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రేటర్ వరంగల్ లోని 66 డివిజన్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్ట్ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంచార్జ్ ఎస్ఈ మహేందర్ వివరించారు.ఈ సమావేశం లో అదనపు కమిషనర్ జోనా, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జ్ ఎస్ ఈ,సిపిలు మహేందర్, రవీందర్ రాధాకర్, ఉప కమిషనర్ ప్రసన్న రాణి, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిని ఆంగ్లంలో ప్రతిభావంతులుగా తయారు చేయాలి

- మరిపెడ ఆంగ్ల సముదాయ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనంతరావు



**మరిపెడ ఆగస్టు 1 (జనంసాక్షి):** మరిపెడ ఉన్నత పాఠశాలలో మరిపెడ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనంతరావు ఆధ్వర్యంలో ఆంగ్ల పాఠశాల సముదాయ సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం లో భాగంగా నిర్వహించిన బేస్ లైన్ టెస్ట్ పై రివ్యూ నిర్వహించారు.ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులందరికీ ఆంగ్లంలో మాట్లాడడం, చదవడం, రాయడంలో (ఐఎఫ్‌పి) ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా ఉన్నతమైన శిక్షణ ఇవ్వాలని కోరారు. తదుపరి కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ బయగాని రామ్మోహన్ ఉపాధ్యాయులందరికీ లర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఆంగ్ల విషయాలను విద్యార్థులకు ఎలా బోధించాలో, లర్నింగ్ అవుట్ కమ్స్ ఏవిధంగా సాధించాలో ప్రతి ఉపాధ్యాయుడి చేత ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ఉపయోగింపజేసి అర్థం చేయించారు. ఈ కార్యక్రమంలో నరసింహుల పేట, చిన్న గూడూరు, మరిపెడ మండలంలోని ఆంగ్ల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుట్టిన బిడ్డకు ముర్రుపాలు శ్రేయస్కారం

- సిడిపివో నాగమణి




**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 01,(జనంసాక్షి):** తల్లి పాల వారోత్సవాల భాగంగా శుక్రవారం నిర్మల్ అర్బన్ మహాలక్ష్మి వాడ లో అపుడే పుట్టిన బిడ్డ కు వీలైనంత తొందరగా ముర్రు పాలు పట్టించాలని నిర్మల్ సిడిపివో నాగమణి అన్నారు. ఈసందర్భంగా తల్లి పాల వారోత్సవాల ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మీ మీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అంగన్వాడీ టీచర్లని కోరారు అలాగే బిడ్డకు పుట్టిన దగ్గర నుంచి 6నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి 7నెలలు నుంచి తల్లి పాలతో పాటుగా అదనపు ఆహారం ఇవ్వాలి బిడ్డ కు ఇవ్వాలని సూచించారు. డా,, మనీషా మాట్లాడుతూ ప్రతి గర్భిణీ గవర్నమెంట్ హాస్పిటల్ లో కాన్పు చేసుకోవాలని సూచించారు. ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లోద్దని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్ వైజర్ విజయగౌరీ ఏఎన్ఎం సుమలత అంగన్వాడీ టీచర్స్ శైలజ సదా లక్ష్మి ఆశ పద్మ సుజాత, శిరీష, లావణ్య,గర్భిణీలు బాలింతలు పిల్లల, పాల్గొన్నారు.

# అభద్రతా భావాన్ని తొలగించేందుకే కాటన్ సెర్చ్

- సీఐ సిహెచ్.అజయ్



**ఖానాపూర్ ఆగస్టు 01 (జనంసాక్షి):** ప్రజలలో అభద్రతాభావాన్ని తొలగించడమే లక్ష్యంగా పోలీసులు గార్డెన్ అండ్ సెర్చ్ చేపట్టినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.అజయ్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు దురలవాట్లను అలవర్చుకొని మానవమనగడ కోల్పోతున్నారని అన్నారు. గంజా లాంటి మత్తుపదార్థాలకు బానిసలై యువత చెడు మార్గాలను ఎంచుకోవద్దని వారి భావి భవిష్యత్తును కాలరాచుకోవద్దని సిఐ స్పష్టం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా కాలనీలో సంచరించినట్లయితే వెంటనే స్థానిక పోలీసు వారికి లేదా 100 నంబరు కు సమాచారం అందించాలని సూచించారు. ఎలాంటి నిషేధిత వస్తువులు కానీ పదార్థాలు కానీ కనిపించినప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితె వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ప్రజలు స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్ లో 45 ద్విచక్ర వాహనాలతో పాటు నాలుగు ఆటో రిక్షాలు ఒక కారూ ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాటిగా గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఖానాపూర్, కడెం, పెంబి ఎస్ఐలు రాహుల్ గైక్వాడ్, సాయికిరణ్, హన్మండ్లు లతో పాటు 40 మంది సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

# నూతన రేషన్ కార్డులతో పేద ప్రజలకు ఆహార భద్రత

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**చింతలమానపల్లి ఆగస్టు 1 (జనంసాక్షి):** ప్రభుత్వం అందజేస్తున్న నూతన రేషన్ కార్డుల వల్ల పేద ప్రజలందరికీ ఆహార భద్రత కలుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు .శుక్రవారం చింతలమానపల్లి మండల కేంద్రంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో అదిలా బాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ తో కలిసి ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లా డుతూ.నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రజలకు మేలు కలుగుతుందని తెలిపారు. చింతలమానపెల్లి మండలానికి నూతనంగా 1500 రేషన్ కార్డులు మంజూరు కాగా. 500 కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లను అదనంగా చేర్చడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కచ్చితంగా రేషన్ కార్డు అందజేస్తామని అన్నారు.ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుందని ప్రజలు వాటిని సద్వినియోగించు కోవాలని తెలిపారు ఎమ్మెల్సీ. దండ విట్టల్ .మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల పంపిణీ సంతోషకరమైన విషయమని అన్నారు. పేదలకు ప్రతినెల బియ్యం అందిస్తున్నందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్ర మంలో జెసి డెవిల్ కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల .వ్యవసాయ అధికారి ఏ డి ఏ మనోహర్. మండల రెవెన్యూ అధికారి మడవి దౌలత్ ఎంపీడీవో సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరా క్రాంతి మండల సమైక్య ఏపియం మంజులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**టేకుమట్ల ఆగస్టు 01(జనంసాక్షి):** టేకుమట్ల మండల నూతన మండల సమైక్య ఏపీఎం గా ఎన్నికైన చిలువేరు మంజుల ను సన్మానించిన మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్. ఈ సందర్భంగా వారిని శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేయడం తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ నిరుపేద మహిళ సంఘాలను ఆర్థికంగా ఎదిగే విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పెల్లి వీరేశం, మండల ఉపాధ్యక్షుడు మాధం కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శి పోన్నం సాంబయ్య, మండల కోశాధికారి శాస్త్రాల కిరణ్,బోనగిరి తిరుపతి పాల్గొన్నారు.

### శ్రావణ శుక్రవారం సందర్భంగా

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**మల్హర్, ఆగస్టు 01(జనంసాక్షి):** శ్రావణ మాసం పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల, కొయ్యూరు, మల్లారం,వల్లెంకుంట,పెద్దతూరుద్రారం,ఎడ్లపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిచర్ల ముదిరాజుల కులదేవత ఐన పెద్దమ్మ తల్లి ఆలయంలో,అలాగే కొయ్యూరు లక్ష్మీదేవర ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గాజులు,పసుపు కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## యువకుడి అద్రుశ్యం

**శాయంపేట, ఆగస్టు 1(జనంసాక్షి):** శాయంపేటకి చెందిన పొట్టకారి వికాస్ , వయస్సు 31 సంవత్సరాలు తేదీ 29.07. 2025 రోజు నుండి కనబడుటలేదు. అతను 6 అడుగుల ఎత్తు, చామనచాయ రంగులో ఉండి, తెలుపు రంగు షర్ట్ మరియు నలుపు రంగు ప్యాంటు ధరించి ఉంటాడు. కావున ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది నంబర్స్ కి కాల్ చేయగలరు అని శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తెలిపారు సెల్:8712685227 8712685018.



### బాధ్యతలు స్వీకరించిన నూతన ఏపీఎం విర్ల వేణు



**భీమదేవరపల్లి:ఆగస్టు01(జనంసాక్షి):** ఇటీవల మండల ఏపిఎం దేవానంద్ గత పది సంవత్సరాలుగా విధులు,నిర్వర్తించిన దేవానంద్ బదిలీ పై ధర్మ సాగర్ వెళ్లారు.నూతనగాభీమదేవరపల్లి మండలం ఏపిఎంగా వర్ధన్నపేట నుంచి విల్లు.వేణు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.భరతమాత మండల సమైక్య లోని ఒబిలు,సీసీలు,వివోఏలు,మండల సమితి సభ్యులుసమైక్య కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చమిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన ఏపిఎం విర్ల వేణు మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా సంఘాలను బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

### షాపల్లి అంగన్వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల,

# గ్రామంలో పారిశుద్ధ పనులను తనిఖీ

- తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ డిసీసెస్ స్పెషల్
- ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి







**ఏటూరునాగారం,ఆగష్టు 01(జనంసాక్షి):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కన్నాయి గూడెం, చిన్న బోయినపల్లి ఉపకేంద్రం పరిధి లోని షాపల్లి గ్రామాన్ని తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ డిసీసేస్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సందర్శించి ఆ గ్రామంలో డెంగ్యూ వ్యాధి బారిన పడిన ఇంటిని సందర్శించి బాలుని ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని బాలుని తండ్రితో మాట్లాడుతూ బాలుడు రక్తహీనతతో ఉన్నాడని అతనికి పోషకాహారాన్ని ఇవ్వాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరము వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సను తీసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం అంగన్వాడీ సెంటర్ ను, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, డెమో సంపత్, ఏఎంఓ దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారావు, ఆరోగ్య కార్యకర్త భాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 01 (జనంసాక్షి):** విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బకాయిలు సకా లంలోచెల్లించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఏడిఈ పి రణధీర్ రెడ్డి అన్నారు. ఘనపూర్ పట్టణ పరిధిలో గతనెల విద్యుత్ బకాయిల వసూళ్లలో అను కున్న లక్ష్యం సాధించకపోవడంతో ఎడిఈ ఘనపూర్ రణధీర్ రెడ్డి స్వయంగా శుక్రవారం రోజున బకాయిలవసూళ్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు బకాయిలు లేకుండా సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. 1వ తేదీ నుండి ఐదవ తేదీ వరకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక నెల బకాయి ఉన్నా అట్టి సర్వీసు కనెక్షన్ తొలగి స్తామని వినియోగ దారులు సకాలంలో బిల్లులుచెల్లించి సిబ్బందికి సహక రించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎఈ ఆపరేషన్ ఘనపూర్ టౌన్ పి శంకర్,లైన్ ఇన్స్పెక్టర్ ఓ యాదగిరి, లైన్మెన్ లు వాసం శ్రీధర్, అన్వర్ పాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాలి : రత్నం రాజేందర్

**మంగపేట ఆగస్టు01(జనంసాక్షి):** రాష్ట్రంలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యపోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే సమ్మక్క పిలుపు నిచ్చారు. శుక్రవారం రాజుపేట, రామచంద్రునిపేట, మల్లూరు పరిధిలో గల 100 మంది అంగన్వాడి టీచర్లు , ఆయాలు సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మక్కల సమక్షంలో సీఐటీయూలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలే శరణ్యమని వారు అన్నారు. గతంలో అంగన్వాడీలు సిఐటియు నాయకత్వంలో అనేక పోరాటాలు చేసిన ఫలితంగా ఇప్పుడున్న కొన్ని సౌకర్యాలు సాధించడం జరిగిందని అన్నారు. పీఎం శ్రీ పేరుతో ప్రభుత్వ పాఠశాల లలో ప్రీ స్కూల్ ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం చెప్పిందని అంగన్వాడి సెంటర్లలో ప్రీస్కూల్ దీనివల్ల ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు సరిత, భాగ్యలక్ష్మి , లక్ష్మీనరసింహా, మల్లికార్జున, ప్రభావతి, రమ, వెంకట నరసమ్మ, తార, వాణిశ్రీ, నాగలక్ష్మి, వెంకాయమ్మ, ఆదిలక్ష్మి ,వజ్ర పాల్గొన్నారు.





## శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన

- అడిషనల్ డిజిపి



**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిది శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ని ఆర్.బి.వి.ఆర్.ఆర్ డైరెక్టర్ ,అడిషనల్ డిజిపి అభిలాష్ బిస్త్ సందర్శించడం జరిగింది.పోలీస్ స్టేషన్ చేరుకొన్న అడిషనల్ డిజిపి కి జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్,ఎస్సై సంతోష్ మొక్కలు అందజేసి స్వాగతం పలకడం జరిగింది.ఏఆర్ మహిళా సాయిధ దళ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రిసెప్షన్ సెంటర్ను సందర్శించి రిసెప్షన్ డ్యూటీలు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందితో మాట్లాడి బాధితులు వచ్చినప్పుడు ఏ విధంగా వారిని రిసీవ్ చేసుకుంటు న్నారు, వారి సమస్యలు ఏ విధంగా తెలుసుకుంటున్నారు అని అడిగి తెలుసుకోవడం జరిగింది.పోలీస్ స్టేషన్లోని రూమ్స్, లాకప్, విమెన్,మెన్ బ్యారక్ పరిసరాలను,వాష్ రూమ్స్ పరిశీలించారు ,టెక్నికల్ రూం,సిసి కెమెరాలను పని తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకు న్నారు. సిబ్బం దితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరిం చడం,బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించా లని చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత,వాతావరణం ,పోలీస్ స్టేషన్ నిర్వహణ,సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి జనగామ అమ్మ ఫౌండేషన్

**జనగామ ప్రతినిధి, ఆగష్టు 01(జనంసాక్షి):** జనగాం పట్టణంలోని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఐదు రోజులు దీక్షలు చేపడుతున్న బ్రిడ్జ్ సాధన సమితి అధ్యక్షులు యాసారపు కరుణాకర్ వారు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలను సందర్శించి నా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ మాట్లాడుతూ జనగామ మండలం గానుగుపాడు చిటకోడూర్ మధ్య బ్రిడ్జి నిర్మాణ చేపట్టాలని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఒక సమస్యపై రిలే నిరాహార దీక్షలు చేసిన ప్రభుత్వం అధికారులు స్పందించాలని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు సంఘీభావం తెలిపినరు.



# గ్రామ గ్రామాన జెండా పండుగలు నిర్వహించాలి

- ఆదివాసి దినోత్సవాన్ని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఏజిఎస్ )



**మహా ముత్తారం ఆగస్టు 01( జనంసాక్షి):** గ్రామ గ్రామాన జెండా పండుగలు నిర్వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ ఆదివాసి ప్రజానీకానికి పిలుపునిచ్చారు. శుక్రవారం మహా ముత్తారం మండల పోలంపల్లి గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జెండా పండుగలు గ్రామ గ్రామాన నిర్వహిస్తూ ఆదివాసుల యొక్క సంస్కృతి సంప్రదాయాలు కలలు పరిరక్షించుకునే విధంగా ప్రతి గ్రామంలోని గ్రామ పెద్దలు మేధావులు ఉద్యోగులు విద్యార్థిని విద్యార్థులు యువతీ యువకులు కళాకారులు మేధావులు పాల్గొని ప్రతి ఒక్కరు ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని వారు కోరారు.ఐక్యరాజ్యసమితి ఆదివాసి ప్రాంతాల మీద దశాబ్ద కాలం పాటు అధ్యయనం చేసి ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు జీవన విధానం ఇతర సమాజాలకు భిన్నంగా ఉందని ఏ దేశంలో నైనా పరిపాలకుల విధానా ల వల్ల ఆదివాసి మనగడకే ప్రశ్నార్థకం అవుతుందని, ఏ దేశంలో నైనా పాలకులు ఆదివాసి అభివృద్ధి పట్ల ఆదివాసి మనుగడను, ప్రశ్నార్థకం చేసే విధానాలను అనుసరించవద్దని, వారి అభివృద్ధికి దోహదపడాలని, సూచించి నప్పటికీ, ఆదివాసీ వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ నిరంతరం ఆదివాసి హక్కుల మీద ఆదివాసి అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా పరిపాలన సాగుతుందని అన్నారు. ఈ అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వాల యొక్క ఆదివాసి వ్యతిరేక విధానాలను ప్రతి ఆదివాసి ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా ఆదివాసి దినోత్సవాన్ని ప్రభుత్వ సెలవు దినంగ ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించినప్పుడే ఆదివాసి సమాజంలో ఉన్న మేధావులుగా ప్రజలందరినీ చైతన్యం చేసి వారు స్వేచ్ఛగా పాల్గొనడానికి అవకాశం ఉంటుందని అలాంటి చర్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించాలని లేనిపక్షంలో ఆదివాసి వ్యతిరేక ప్రభుత్వాలుగా మిగులుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల రాజు, కాపుల విజయ్, తెలంగాణ ఆదివాసి విద్యార్థి సంఘం నాయకులు మడకం నిర్మ ,గుంటి అంజలి, తోట చచందన, తేజ అశ్విని, పాల్గొన్నారు.

## వరంగల్‌లో బిజెపి ప్రశిక్షణ్ అభియాన్ కార్యక్రమం



**వరంగల్ ఎంజీఎం, ఆగష్టు 1(జనంసాక్షి):** రెండు రోజులగా జరుగుతున్నా బిజెపి ప్రశిక్షణ్ అభియాన్ కార్యక్రమనికి విచేస్తున్న అతిధిలకు స్వాగతం పలుకుతున్న డాక్టర్ వన్నాల వెంకట రమణ .వరంగల్ లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రెండు రోజుల బీజేపీ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమనికి ముఖ్య అతిధిలుగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు గారు, మురళీ ధర్ రావు మరియు ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ వారితో పాటు పాల్గొని అనంతరం వారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కారించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ. సైదాంతిక సాధికారత సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయ దానికి చేపట్టవలసిన ప్రణాళికలను నిర్మాణాత్మక వ్యవహారాలను గురించి ఈ కార్యక్రమంలో వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వరంగ ల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు సంతోష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు మల్లాది తిరుపతి రెడ్డి, శ్రీభకం హరిశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు రంజిత్, రాష్ట్ర పదధికారులు, జిల్లా నాయ కులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల కాలేజీని పరిశీలించిన తహసీల్దార్ గిరిబాబు

**ములుగు,ఆగస్టు1(జనంసాక్షి):**




వెంకటాపూర్ మండల కేంద్రం లోని మైనారిటీ గురుకుల బాలికల కాలేజ్‌ని శుక్రవారం వెంకటాపూర్ మండల తహసీల్దార్ గిరిబాబు పరిశీలించారు ఈ సందర్బంగా ఆయన కళాశాల పరిసరాలతో పాటు టీచర్స్, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలన చేశారు.అదేవిదంగా విద్యార్థులకి అందించే భోజనాన్ని సైతం పరిశీలన చేశారు.అనంతరం తహసీల్దార్ గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు అదేవిదంగా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని సూచించారు.ముఖ్యంగా వర్షాకాలంలో విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని కోరారు. అంతేకాకుండా విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు టీచర్స్ నిరంతరం కృషి చేయాలని అన్నారు.

## కాచం కృష్ణమూర్తి ఆశయాలు కొనసాగిస్తాం



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 01 (జనంసాక్షి):** లివీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి ఆశయాలు కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అన్నారు.డివిజన్ కేంద్రంలో శుక్రవారం సిపిఎంమండల కార్యాలయంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి 19వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఆయన చిత్రపటా ని కి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు మాట్లాడుతూ నాటి నైజాం నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా దేశముఖ్ దొరలు భూస్వాములకు వ్యతిరేకం గా సాగిన మహంతరమైన పోరాటం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. ఆ పోరాటంలో రాష్ట్రంలోనే అగ్రగన్యుడుగా జనగామ ప్రాంతం నల్లగొండ మరియు రంగారెడ్డి జిల్లాలో సాయుధ పోరాట రూపకల్పనలో కీలక భూమిక పోషించిన మహానీయుడు కాచం కృష్ణమూర్తి అని అన్నారు. ఆనాటి నాయకుల పోరాట ఫలితమే నేడు ఉపాధి హామీ చట్టం అని అన్నారు. వారి ఆశయాల సాధన కోసం సిపిఎం పార్టీ కార్యకర్తలు సైనికుల పనిచే యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యకయ్య, చిలుముల్ల భాస్కర్, మంద మహేందర్, బోసు రాజు, నీల శ్రీనివాస్, నిమ్మల రాజు ,చుంచు రాములు పాల్గొన్నారు.

## ఎంపీ బలరాం నాయక్‌ను కలిసిన న్యాయవాది మారపాక ప్రలక్ష్మణ్



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 01(జనంసాక్షి):** మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, స్టేషన్ ఘన్పూర్ బార్ అసోసియేషన్ కార్యదర్శి మారపాక ప్రలక్ష్మణ్ సతీసమేతంగా మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత పార్లమెంట్ మెంబర్ బలరాం నాయక్ ని శుక్రవారం రోజున డిల్లీ లో మరదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి, పార్ల మెంట్ మెంబర్ బలరాంనాయక్ ని కలిసి రాజకీయ, లీగల్ సంబంధించి అనేక విషయాలపై చర్చించడం జరిగిందని ప్రముఖ న్యాయవాది మరపక ప్రలక్ష్మణ్ తెలిపారు.

## విద్యార్థులకు సైకిల్లు పంపిణీ చేసిన ప్రొఫెసర్ బైరి వెంకటరామిరెడ్డి



**శాయంపేట, ఆగస్టు 1 (జనంసాక్షి):** పేదరికం అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలంటే విద్యతోనే సాధ్యం అవుతుందని అప్పుడే మన జీవితానికి పరిపూర్ణత లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బైరి వెంకటరామిరెడ్డి అన్నారు .శాయంపేట మండలం పెద్దకోడపాక ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..విద్యార్థులు పట్టుదల,అంకితభావం, క్రమశిక్షణతో చదివి తాము ఎంచుకున్న లక్ష్యాలనుసాధించాలని అన్నారు.అనంతరం దూర ప్రాంతాలు అయిన కామారెడ్డి పల్లి ,మైలారం, గోవిందపూర్, జోగంపల్లి నుండి వస్తున్న పదిమంది విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసి వితరణ చాటుకున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మనం చదువుకున్న పాఠశాలలకు తిరిగి మనకు వీలైనంత స్థాయిలో సహకరించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలింపుర్ రెడ్డి సంఘ అధ్యక్షులుగా దేవి ఎల్లారెడ్డి



**బచ్చన్నపేట ఆగస్టు 1( జనంసాక్షి):** బచ్చన్నపేట మండలం ఆలిం పూర్ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షునిగా దేవి ఎల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఉపాధ్యక్షులుగా పోరెడ్డి అనంతరెడ్డి, దండ్యాల మల్లారెడ్డి,కార్యదర్శిగా పెద్దపాటి కరుణార్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా పిట్ట మహెందర్ రెడ్డి, సలహాదారులుగాగంట తిరుమల్ రెడ్డి,నరెడ్ల బాల్ రెడ్డి, గూడ రవిందర్ రెడ్డి,తొగిట బాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఉడెం సంతోష్ రెడ్డి, ఆలేటి సిద్దా రెడ్డి, వంగపల్లి రంగారెడ్డి, కర్తాల సుధాకర్ రెడ్డి, గంట తిరుపతి రెడ్డి, చల్ల రాజి రెడ్డి,ఉమెంతల హైమావతిని ఎన్నుకున్నారు.ఈ సంద ర్భంగా ఎల్లారెడ్డి మాట్లా డుతూ రెడ్డి వర్గీలంతా ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. తనపై ఉన్న నమ్మకం తో అధ్యక్ష పదవి అప్పగించినందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదే నమ్మకంతో సంఘ బలోపేతానికి పాటుపడతానన్నారు. రెడ్డి సంఘం సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తా అన్నారు. సంఘం సభ్యులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సంఘం సభ్యులతో కలిసి ముందుకెళ్తా అన్నారు ముందుకెళ్తాన న్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 01 (జనంసాక్షి) :** గ్రామంలో ఉన్న ఉపాధి కూలీలు ఉపాధి హామీ పనుల ను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ నరసయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏదునూరి సత్యనారాయణ అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో 04 వ విడత సామాజిక తనికిలో భాగంగా 01 ఏప్రిల్ 2024 నుండి31మార్చి2025 వరకు జరిగిన పనులు గురించి ఉపాధి హామీ సామాజిక తనికి గ్రామ సభ నిర్వహించ డం జరిగింది.ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారు. జరిగిన ఖర్చుల వివరాలు మెటీరియల్ వివరాలు చదివి వినిపించడం జరిగింది.ఈ నివేదికను పై అధికారులకు అందజేయడం జరుగుతుంది అని తనిఖీ బృందం తెలిపారు.ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్ పర్సన్ నరసయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీపనులలో ఎలాంటి అవినీతిజరగకుండా కూలీలకు న్యాయం జరిగేల పనులు కల్పించి వారికి వెంట వెంటనే బిల్లులు వచ్చేలా చూడాలనిఅన్నారు. ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో ప్రేమయ్య, ఈసీ కిరణ్,టెక్నికల్ అసిస్టెంట్ సునీత,కరోబార్ సలీం,రికార్డ్ అసిస్టెంట్ పోకల నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, మేట్ మధుబాబు, కూలీలు, మెట్లు పాల్గొనడం జరిగింది.

## క్లస్టర్ అధికారి డీఎఫ్ఓ నవీన్ రెడ్డి మండలంలో పర్యటన



**మహదేవపూర్ ఆగస్టు 1 (జనంసాక్షి):** మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల తో పాటు సామాజిక ఆసుపత్రి, గిరిజన వసతి గృహం క్లస్టర్ అధికారి, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి డిసిఎస్ ఓ, కిరణ్ తనిఖీ చేయడం జరిగింది. జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమా లను ప్రజా సేవ అమలుపై సమగ్ర పర్యవేక్షణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా క్లస్టర్ మండల ప్రత్యేక అధికారులను గత నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ మహాదేవపూర్ పలిమెల మండలాలకు, క్లస్టర్ ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది. శుక్రవారం రోజు క్లస్టర్ అధికారి నవీన్ రెడ్డి తోపాటు మండల ప్రత్యేక అధికారి కిరణ్, మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల తనిఖీ నిర్వహించారు. గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహములో ఉపాధ్యాయుల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత, ను పర్యవేక్షించడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలోని, సామాజిక ఆసుపత్రి రోగులను వైద్యులు అందిస్తున్న చికిత్సను రోగులతో అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా సామాజిక ఆసుపత్రిలో పారిశుద్యం తో పాటు వైద్యుల నియామకం, ఇతర అవసరాలను క్లస్టర్ అధికారి నవీన్ రెడ్డి కు వివరించడం జరిగింది. గిరిజన బాలికల వసతి గృహాన్ని క్లస్టర్ అధికారి నవీన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి కిరణ్ విద్యార్థులకు అందించే మెనూ, పాఠశాలల్లో పారిశుద్యం పై విద్యార్థులతో అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం నవీన్ రెడ్డి విద్యార్థులతో కలిసి, భోజనం చేశారు. అధికారుల పర్యటనలు, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## 3వ తేదీ నుండి గ్రామాల్లో సోషల్ ఆడిట్ గ్రామసభలు

**చెన్నారావుపేట, ఆగస్టు 1 (జనంసాక్షి):** ఈనెల 3వ తేదీ నుండి 11వ తేదీ వరకు గ్రామాలలో సోషల్ ఆడిట్ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నల్ల శ్రీవాణి, ఉపాధి హామీ ఏపీవో అరుణ, ఈసీ కిషోర్ కుమార్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి గంగరాజులు శుక్రవారం తెలిపారు. 3 వ తేదీన ఆదివారం లింగగిరి, సూర్యాపేట తండా, 4న ఉప్పరపల్లి, శంకరం తండా, కోనాపురం, అమృతండా, పుల్లయ్య బోడు తండా, గొల్లభామ తండా, కాల్ నాయక్ తండా, గొల్లపల్లె, 6 న కందిగడ్డ తండా, తిమ్మరాయిని పహాడ్, 7న ఎల్లాయగూడెం, పత్తి నాయక్ తండ, ఖాదర్ పేట, బాపునగర్, 8న జల్లి, లింగాపురం, పాపయ్యపేట, అక్కల్ చెడ, 16 చింతల తండా, జీడిగడ్డ తండా, 10న అమీనాబాద్, తోపనగడ్డ తండా, బోడ మాణిక్యం తండా, 11న బోజేరువు, చెన్నారావుపేట, ధర్మ తండా, చెరువు కొమ్ము తండా, జోజిపేట నారాయణ తండా గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు ప్రతి ఒక్కరూ గ్రామ సభలకు హాజరై గ్రామసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. 12వ తేదీన మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు సోషల్ ఆడిట్ ప్రజావేదిక సభ ఉంటుందని వారు తెలిపారు.

## అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వండి


• ఎస్ఐ చల్ల రాజు




**ములుగు/వెంకటాపూర్,ఆగస్టు1(జనంసాక్షి):** మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా వెంకటాపూర్ మండలం లోని వెల్తుర్లపల్లి గ్రామం లో వాహనాలను ఎస్ఐ చల్ల రాజు తనిఖీ చేయడం జరిగింది.వాహనదారుల యొక్క వాహన పత్రాలను మరియు వాహనదారుల యొక్క వివరాలు చెకింగ్ చేయడం జరిగింది.వాహనదారులకు పలు సూచనలు చేశారు .సంఘవిద్రోహులు ,అనుమానిత వ్యక్తుల యొక్క సమాచారం తెలిస్తే పోలీస్ వారికి తెలియచేయా లనీ సూచించడమైనది. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజుపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు రుణ మంజూరు చెక్కు అందజేత

**నస్పూర్(జనంసాక్షి):** తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాం పల్లి శాఖ,మెప్మా ల సంయుక్త ఆధ్వర్యంలో శాఖ కార్యాలయంలో గ్రామీణ బ్యాంకు మంచిర్యాల రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా,విశిష్ట అతిథిగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజ మనోహర్ హాజరై 36 మహిళా సంఘాలకు జూలై నెలలో విడుదల చేసిన 6కోట్ల 50లక్షల రుణ మంజూరుకు సంబంధించిన చెక్కు ను అందజేయడం జరిగింది.ఆర్ ఎం దాముక ప్రభుదాసు మాట్లాడుతూ తమ యొక్క సీతారాంపల్లి శాఖ పరిధిలో మహిళా సంఘాలు బాగా పనిచేస్తున్నాయని తెలిపారు.శాఖ పరిధిలో ఇప్పటివరకు 632 మహిళా సంఘాలకు 50 కోట్ల రూపాయల రుణాలు మంజూరు జేయడం జరిగిందని తెలిపారు. గత జూలై నెలలో 36 సంఘాలకు 6 కోట్ల 50 లక్షల రూపాయల రుణాలను మంజూరు చేయడం జరిగిందని,మహిళా సంఘాల సభ్యులకు మహిళా ముద్ర యోజన పథకం కింద 30 మంది మహిళలకు 15 లక్షల రూపాయల రుణాలను మంజూరు చేయడం జరిగిందని, మహిళా సంఘాలు వారి వారి సంఘాల పుస్తకాల నిర్వహణ,అంతర్గత రుణ చెల్లింపుల పనితీరు,బ్యాంకు రుణాల సక్రమ చెల్లింపుల ఆధారంగా ఆయా గ్రూపులకు మరిన్ని సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు.మహిళ సంఘాలకు అర్హతను బట్టి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా 20 లక్షల రూపాయల వరకు రుణం మంజూరు చేయడం జరుగుతుందని, సక్రమంగా చెల్లించే గ్రూపులలోని సభ్యులు ఇతర వృత్తులు చేసుకునేందుకు గాను మహిళా ముద్ర యోజన కింద తలా 50 వేల రూపాయల వరకు అదనపు రుణం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు తమ తమ నెలవారి మీటింగులను సక్రమంగా నిర్వహించుకోవాలని అంతర్గత పొదుపులను, రుణ కిస్తులను ప్రతినెలా సమయానుసారం సక్రమంగా చెల్లించాలని తెలియజేశారు. విశిష్ట అతిథిగా హాజరైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్




సంపత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఒక్క నెలలోనే మహిళా సంఘాలకు 6.50 కోట్ల రుణాలు ఇవ్వడం,ఇంకా వివిధ వృత్తుల నిర్వహించు కొనుటకు అదనంగా 15 లక్షల రుణాలు ఇవ్వడం మహిళల ఆర్థిక పురోభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తుందని, ఇటువంటి రుణాలను సక్రమంగా చెల్లించి మరిన్ని రుణాలు పొంది ఆర్థిక భద్రతను మహిళా సంఘాల సభ్యులు సాధించుకోవాలని తెలియజేశారు.ఈ పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వివిధ బ్యాంకు పథకాలను మహిళా సంఘాల సభ్యులు మరింతగా ఉపయోగించు కోవాలంటే ప్రతినెల సక్రమంగా రుణకిస్తులను బ్యాంకులో జమ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మంచిర్యాల రీజన్ రుణాల ప్రధాన అధికారి రవి కిషోర్ రెడ్డి ,సీతారాంపల్లి శాఖ మేనేజర్ నరసింహ స్వామి,ఫీల్డ్ ఆఫీసర్ రవి,బ్యాంకు సిబ్బంది,మెప్మా యొక్క టీఎంసీ నాగరాజు ,ఆర్పీలు,రుణాలు పొందిన మహిళా సభ్యులు, పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి అదనపు

• కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ రూరల్,ఆగస్టు1(జనంసాక్షి):** మున్సిపాలిటీల అభివృద్ధికి నిరంతరం స్పష్టమైన ప్రణాళికతో కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్యం,పన్నుల వసూలు,మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్లు,పట్టణ సుందరీకరణ, అంశాలపై మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అన్ని అభివృ ద్ధి,మౌలిక సదుపాయాల పనులను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం చారు. వాణిజ్య,వ్యాపార, ప్రకటనల, పన్నులు అన్నింటిని సకాలంలో వసూలు చేయాలన్నారు. వార్డుల్లో నిరంతరం మెరుగైన పారిశుద్యం నిర్వహించాల న్నారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించ కుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.నీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందు లు తలెత్తకుండా చూడాలన్నారు.పట్టణంలో కీలకమైన కూడళ్ళ లో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు .మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు అధికారులంతా సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,మున్సిపల్ అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.



# లక్సెట్టిపేటలో సామూహిక వరలక్ష్మి వ్రతం

**లక్షెట్టిపేట ఆగస్టు 01 (జనంసాక్షి):** లక్సెట్టిపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక మండపంలో అష్టలక్ష్మిలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు లలిత పారాయణం చేసిన అనంతరం వేద పండితులచే వర లక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలను నిర్వహించారు. కార్యక్రమానంతరం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు భక్తి శ్రద్ధలతో ఈ సామూహిక వరలక్ష్మి వ్రతం చేసుకున్నారు. లక్కీ డిప్ విజేతలు అయిన పల్లెర్ల పద్మ, చంద్రకళ లకు బహుమతిగా చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మైలారపు సుధాకర్, పల్లెర్ల మహేందర్ , తాటికొండ శ్రీనివాస్, పల్లెర్ల శ్రీనివాస్, పాలకుర్తి లచ్చన్న , కొత్త అనిల్, గుండ సంతోష్, గంప రాజేశం ,ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందుల సాహితి, కాసం స్వప్న, అక్కినపల్లి రాధిక, ఎనగందుల శరణ్య , బొల్లం హిమ బిందు ,బోనగిరి దీపిక, వచ్చేలా రమాదేవి, గుండ ఇందిర, బొద్దుకూరి



సంధ్య, రావి కంటి సుమ, పాల్గొన్నారు.అందరూ బాగుండాలని ఈ సామూహిక వరలక్ష్మి వ్రతంనరేందుల సాహితిజిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిఅందరూ సుఖశాంతులతో బాగుండాలని సదుద్దేశంతోనే ఈ శ్రావణమాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలు నిర్వహిందం జరిగింది. శ్రావణమాసం అంటేనే భక్తిశ్రద్ధలతో గడిపే మాసం. ప్రతి ఒక్కరు ఆ దేవి కృపతో ధన,ధాన్యాలతో సంతోషంగా ఉండాలని నిర్వహించాము.

# కాంగ్రెస్‌కు తెలంగాణ త్రాగు,సాగునీటి అవసరాలు కనిపించడం లేదా?

**నస్పూర్ (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల త్రాగు,సాగునీటి అవసరాలు కనిపించడం లేదా అని వాటర్ బోర్డు మాజీ చైర్మన్ వేముల ప్రకాష్,ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆధ్వర్యంలో శుక్రవారం నస్పూర్ లోని తెలంగాణ భవన్ లో జరిగిన మంచిర్యాల,ఆసిఫాబాద్ జిల్లాల విద్యార్థి సమావేశం లో అన్నారు.వారు మాట్లాడుతూ కాంగ్రెస్,బిజెపి పార్టీలు చంద్రబాబుతో కలిసి లోపాయకార ఒప్పందాన్ని చేసుకొని తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తానంటే



బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని,ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న గోదావరి 'బనకచర్ల లింక్ ప్రాజెక్ట్'ను రద్దు చేయాలని,గోదావరి నదిపైన తెలంగాణ హక్కులు కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, రవీందర్, తిరుమల్, పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తాడు రాష్ట్ర అడ్వైజరీ బోర్డ్ సభ్యులు ఎన్ఆర్ఐ
- ప్రతినిధి శానబోయిన రాజ్ కుమార్ డిమాండ్
- ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



**వరంగల్ ప్రతినిధి, ఆగష్టు 1(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆటో కార్మికులకు అండగా నిలవాలని తాడు రాష్ట్ర అడ్వైజరీ బోర్డ్ సభ్యులు శానబోయిన రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..శుక్రవారం ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్బంఘా తాడు కమిటీ ఆధ్వర్యంలో గిర్నిబావిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. అడ్వైజరి బోర్డ్ సభ్యులు రాజ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికిల హామీలో భాగంగా ప్రతి ఆటో డ్రైవరికి 12వేల రూపాయలు ఉపాధి కింద భృతి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు, ప్రతి కార్మికునికి లేబర్ కార్డ్ వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు, ప్రతి డ్రైవరికి 5లక్షల ఎక్స్ గ్రెషియా ప్రకటించాలని కోరారు. వేయి కోట్ల తో ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ కోసం ఆటో డ్రైవర్లు అందరూ పాటు పడాలి అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మహా లక్ష్మి పథకం వలన ఆటో డ్రైవర్ కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 6 లక్షల మంది ఆటో డ్రైవర్ల త్యాగపూరిత ఉద్యమాన్ని, 22 మంది ఆటో డ్రైవర్ల ఆత్మబలిదానాలు 6వేల మంది ఆటో డ్రైవర్ల పై నమోదైన క్రిమినల్ కేసులు, 700 రోజులు బందులు సజీవంగా చరిత్రలో నిక్షిప్తం చేస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలిపేవిధంగా వారి శ్రమను,శక్తిని కొలిచేవిధంగా ఒకరోజు ఉండాలని తలచి 1 ఆగస్టు రోజున ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవంను సగౌరవంగా 2014లో వేలాది మంది ఆటో డ్రైవర్ల సమక్షంలో ప్రకటించుకొని 11 సంవత్సరాలుగా 1 ఆగస్టు రోజున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవం ఘనంగా జరుపుకొంటున్నారు. ఈ ఒక్కరోజు, ఒక్క పూట ఆటోడ్రైవర్లు తాము అనుభవిస్తున్న బాధలను ,దుఃఖాన్ని, కష్టాలను,నష్టాలను మరచి ఆనందంతో తమ భవిష్యత్తు కోసం చేయవలసిన కార్యక్రమాలకు రూపకల్పన చేసుకుని ఆచరిస్తూ తమ హక్కుల కోసం నినదిస్తున్నారు.ఎంతో త్యాగపూరిత చరిత్ర కలిగిన 1 ఆగస్టు రోజున 6 లక్షల మంది ఆటో డ్రైవర్లు పవిత్రంగా భావిస్తూ పండుగ జరుపుకుంటున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనతోనే ఆటో డ్రైవర్ సంక్షేమం సాధ్యమని భావించి 2000 సంవత్సరంలో ప్రముఖ గుడిమళ్ళ రవికుమార్ ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ స్థాపించారని.ఆనాటి తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆటో డ్రైవర్లను మమేకం చేస్తూ తెలంగాణ రాష్ట్ర బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని నినదిస్తూనే మరోవైపు ఆటో డ్రైవర్లకు 1000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ముందుకు కదిలారు.1 ఆగస్టు 2011 పార్లమెంటులో తెలంగాణ రాష్ట్రం బిల్ ప్రవేశపెట్టాలి. 1000 కోట్లతో ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పోచమ్మమైదాన్ నుండి హన్మకొండలోని ఏనుగుల గడ్డ వరకు వేలాది మంది ఆటో డ్రైవర్లతో మహార్యాలీ చేపట్టారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి అయ్యాయి కానీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 6లక్షల మంది ఆటో డ్రైవర్ల చిరకాల వాంఛ 1000 కోట్ల ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ మాత్రం కలగానే మిగిలింది.ఆటో డ్రైవర్లు ఆర్థికంగా స్థిరంగా ఉండాలంటే వ్యవహారికంగా దృఢంగా ఉండాలంటే, దర్జాగా జీవించాలంటే 1000 కోట్ల ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ ఒకటే మార్గమని రాజ్ కుమార్ అన్నారు.తాడు రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు 1000 కోట్ల ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ సాధన కోసం,మహాలక్ష్మి పథకం రద్దు కోసం, ఆటో డ్రైవర్ల హక్కుల కోసం ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ఉద్యమించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల గౌరవ సలహాదరుడు మోడెం విద్యాసాగర్, సీనియర్ నాయకులు నరసింహ, మండల అధ్యక్షులు బూర రామకృష్ణ గౌడ్,కార్యదర్శి దండు రాజు, అడ్డాల అధ్యక్షులు పొగాకు దేవేందర్, తెప్పే శెంకర్, గణేష్, రాజేందర్, రహీం, ప్రశాంత్, దేవేందర్, అశోక్,రాజు, నాగరాజు, రాంరాజు, సాంబయ్య, నరేష్,సాంబమూర్తి మండలములోని అన్ని అడ్డాల డ్రైవర్ కార్మికులు పాల్గొన్నారు.

# భద్రాచలం కేంద్రంగా న్యాయకళాశాల ఏర్పాటు చేయాలి

- ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(JAC)



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 01(జనంసాక్షి):** భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.శుక్రవారం నాడు కొమరం భీం విగ్రహ ఆవరణలో ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంఏర్పాటు చేశారు. ఈ సమావేశంలోగోండ్వానా సంక్షేమ పరిషత్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సొంది వీరయ్య మాట్లాడుతూ. తెలంగాణ విభజన వల్ల పార్లమెంట్ నియోజకవర్గం మహబూబాబాద్ వెళ్లిపోవడం వల్ల,మహబూబాబాద్లో బంజారా సామాజిక వర్గానికి చెందిన వారే ఎంపీలు అవుతున్నారని అన్నారు. భవిష్యత్తులో ఎప్పుడు కూడా ఆదివాసి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థుల పోటీ చేసే అవకాశం కనుచూపు మెరలో కనబడడం లేదని ఆయన అన్నారు.గత ప్రభుత్వం బంజారా సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు కొత్తగూడెం కేంద్రంగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారని,ఈ దేశంలో అన్ని వర్గాల కంటే ఆదిమ జాతులే వెనకబడిపోయారని ఐక్యరాజ్యం సమితి సైతం స్పష్టం చేసిందని తెలిపారు .ఆదిమ జాతులని విద్యారంగంలో ముందుకు రాణించేందుకు భద్రాచలం కేంద్రంగా నాయకుల మంజూరు చేస్తే,భవిష్యత్ తరాలు పోలవరం లాంటి పెను విపత్తుల నుండి తమను తాము కాపాడుకునేందుకు న్యాయ కళాశాల ఎంతో కొంత మెట్టుగా నిలబడుతుందని సొంది వీరయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రాచలం కేంద్రంగా ఏ కళాశాల ఏర్పాటు చేయకపోతే, భవిష్యత్తులో అంగాల ఐక్యతతో ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గోండ్వన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సాయి, జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్,ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు ఉయిక శంకర్,ఆదివాసి నవనిర్మాణ వ్యవస్థాపక అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి,వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు,కుంజ మహేష్, అది వాసి లాయర్ చింత సమ్మయ్య,మహిళా నాయకురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

# ఎంపీడీవోకు సన్మానం

**కానపు ఆగస్టు 01 (జనంసాక్షి):** ఖానాపూర్ ఇంచార్జ్ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన రమాకాంత్ను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సత్కరించారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమాకాంత్ మాట్లాడారు. గ్రామ కార్యదర్శులు గ్రామాలలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని వాటి నివృత్తి కోసం జిల్లా అధికారులకు నివేదించే అవకాశం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో ఎంపీఓ రత్నాకర్ రావుతో పాటు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# 270 మంది విద్యార్థులు స్టేషనరీ అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపిన

- అంబేద్కర్ పూలే మహాజన సంఘం జిల్లా అధ్యక్షులు చింత వెంకన్న



**మరిపెడ ఆగస్టు 1 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం, యుపీఎస్ స్కూల్లో , ప్రైమరీ స్కూల్ లలో, మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని, ప్రైమరీ స్కూల్లలో, విద్యార్థిని ,విద్యార్థులు, 270 మందికి,అంబేద్కర్ పూలే మహాజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చింత వెంకన్న , విద్యార్థిని, విద్యార్థులకు, నోట్ బుక్స్ పెన్నులు, పెన్సిల్స్, పంపిణీ చేసినట్లు తెలిపారు, జిల్లా అధ్యక్షులు, చింత వెంకన్న మాట్లాడుతూ, విద్యార్థిని, విద్యార్థులు, 270, మందికి , నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ , పంపిణీ కార్యక్రమానికి సహకరించిన, మనసున్న మహారాజులకు,అంబేద్కర్ పూలే మహాజన సంఘంకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుం టున్నాని అంబేద్కర్ పూలే మహాజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వెంకన్న, అన్నారు.


# కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో వనమహోత్సవం

- మొక్కలు నాటిన డిఎస్పి సూర్యనారాయణ



**కాళేశ్వరం ,ఆగస్టు 01,( జనంసాక్షి):** రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లి'వనమహోత్సవం-2025'లి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాటారం డిఎస్పి సూర్యనారాయణ మహాదేవపూర్ సీఐ రామచంద్ర రావు ,ఎస్సైజి తమాషా రెడ్డి కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆనంతరం కాటారం డిఎస్పి సూర్యనారాయణ , మహాదేవపూర్ సీఐ రామచంద్రరావు లు మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణ మానవ మనుగడకు ముఖ్యం అని అన్నారు. కస్తూర్బా పాఠశాల విద్యార్థులను ఉద్దేశిస్తూ భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి భావితరాలకు దిక్సూచి కావాలని వారు ఆకాంక్షించారు. పిల్లలతో కలిసి మొక్కలు నాటడం సంతోషాన్ని కలిగించిందని వారు తెలిపారు. ఈ వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొని మొక్కలు నాటాలన్నారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం రెండవ ఎస్ఐ భగవత్, ప్రొబెషనరీ ఎస్ఐ రాజశేఖర్,పోలీస్ సిబ్బంది కస్తూర్బా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థి



**పర్వతగిరి ఆగస్టు 01 (జనంసాక్షి):** రాష్ట్ర స్థాయి100 మీటర్లు పరుగు పందెం మరియు లాంగ్ జంప్ లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెద గ్రామంలో ఆర్డిఎఫ్ కల్లెద హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న గుగులోత్ సందీప్ జిల్లా స్థాయి అండర్ 18 అథ్లెటిక్స్ పోటీలో 100 మీటర్ల పరుగులో లాంగ్ జంప్ లో మొదటి స్థానం లో నిలిచి ఆగష్టు 3వ మరియు 4వ తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ పాఠశాల నుండి పదవ తరగతి విద్యార్థి సందిప్ రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం అభినందనీయం అని అన్నారు.ఈ కార్యక్రమ ంలో పాఠశాల ఇంచార్జ సంతోష్, రమేష్,ఏఓఎస్ సల్ల రాజు పిఈటిలు వేణు రవితేజ మరియు ఉపాధ్యా య బృందం ,తల్లి తండ్రులు పాఠశాల విద్యార్థిని విద్యర్థులు పాల్గొని అభినందిచారు.

# భాస్కర్ పుట్టినరోజును ఘనంగా జరిపిన స్నేహితులు



**బచ్చన్నపేట ఆగస్టు 1(జనంసాక్షి):** మండలంలోని శ్రీ స్వయంభు సిద్దేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ మొద్దు భాస్కర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో స్నేహితులు కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో పడమటి కేశ్వాపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, కొడవటూరు ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కల్లెం రమేష్, చిన్న రామన్ చర్ల గ్రామశాఖ అధ్యక్షులు నిమ్మ కరుణాకర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా అధ్యక్షులు పైస రాజశేఖర్, ఎం ఎస్ పి నాయకులు అల్వాల రాజు పాల్గొన్నారు.

# ప్రారంభించారు సరే..దేవాదాయ శాఖకు ఎందుకు అప్పగించలేదు

- **పాల్కూరికి సోమనాధుడు స్మృతి వనంపై కాంగ్రెస్ నాయకుల సూటి ప్రశ్న?**

**పాలకుర్తి, ఆగస్టు 01(జనంసాక్షి):** కోట్లు ఖర్చు చేసి పాల్కూరికి సోమనాధుడు స్మృతి వనాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు దాని నిర్వహణను దేవాదాయ శాఖకు ఎందుకు అప్పగించలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుమారస్వామి మాట్లాడుతూ ముగ్గురు మంత్రులతో పాల్కూరికి సోమనాధుడు స్మృతి వనాన్ని ప్రారంభించారని దాని నిర్వహణను ఎందుకు మరిచిపోయారని అన్నారు. ఆనాడే స్మృతి వనం నిర్వాహన దేవాదాయ శాఖకు అప్పగిస్తే భక్తులతో కిటకిటలాడేదని అన్నారు. అప్పటి మంత్రి దయాకర్‌రావు వైపల్యం వల్లనే స్మృతి వనం అద్వాన్నంగా తయారైందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తోం దన్నారు. ఇప్పటి వరకు అనేక గ్రామాల్లో కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడిన అనేక




ఘటనలు ఉన్నాయని విమర్శిం చారు. ఇప్పటికైన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలను విమర్శిస్తే బీఆర్ఎస్ నాయకులకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మాజీ ఎంపీపీలు గడ్డం యాక సోమయ్య, కారుపోతుల శ్రీనివాస్, ఎం.డి మదార్, జల్గం కుమార్, బొమ్మగాని భాస్కర్, కమ్మగాని నాగయ్య, పెనుగొండ రమేష్. ఆదినారాయణ, పన్నీరు వెంకన్న ఉన్నారు.

## టేకుమట్ల మండల వికలాంగుల అధ్యక్షుడిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**టేకుమట్ల ఆగస్టు 01 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల వికలాంగుల అధ్యక్షునిగా ఎన్నికైన పెద్దంపల్లి గ్రామానికి చెందిన అంబుల కుమారస్వామిని టేకుమట్ల మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ టేకుమట్ల మండలంలోని వికలాంగులందరికీ న్యాయం చేసే విధంగా పనిచేస్తానని ఆయన అన్నారు మండలంలోని వికలాంగుల అందరూ ఎలాంటి సమస్య ఉన్న నా దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపల్లి వీరేశం మండల ప్రధాన కార్యదర్శి బండి రవీందర్ మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య యాదవ్ మండల కోశాధికారి శాస్త్రాల కిరణ్ బోయిని మధుకర్ అందె కుమార్ ఈర్ల స్వామి భాషవేణి ఐలయ్య అప్పని స్వామి కొడారి కుమార్ పాల్గొన్నారు

## పదవివిరమణ పొందిన అధికారికి సన్మానం




**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** ఏరియా సింగరేణి సెక్యూరిటీ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ గా పనిచేసి పదవి విరమణ పొందిన శంకరయ్యను ఏరియా ఎస్ అండ్ పిసి కార్యాలయంలో ఏరియా సింగరేణి జిఎం ఎం.శ్రీనివాస్ ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ 36 సంవత్సరాల సుదీర్ఘ సర్వీస్ చేసిన శంకరయ్య అభినందనీయులని,సంస్థ అభివృద్ధిలో వారు చేసిన కృషి కొనియాడదగినదని వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పనిచేయాలని అలాగే వారి యొక్క శేష జీవితం ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,సెక్యూరిటీ విభాగాధిపతి జక్కా రెడ్డి,ఇన్స్పెక్టర్లు రామిరెడ్డి,రాజన్న, ఏఐటియుసి నాయకులు బద్రి బుచ్చయ్య ,సెక్యూరిటీ విభాగ పిట్ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 01(జనంసాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో శాంతి నగర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ఎలక్ట్రిషన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకు ంది. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం మడకం విజయ్ తండ్రి చంద్రయ్య, వయసు( 42) కులం, కోయ గ్రామ పంచాయతీ లో ఎలక్ట్రిషన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 1:00 గంట సమయంలో శాంతి నగర్ లోని ప్రభుత్వ ఎంపి పి ఎస్ పాఠశాల వద్ద సీలింగ్ ఫ్యాన్ ఫిటింగ్ చేస్తుండగా ప్రమాద వాశాత్తు విద్యుత్ షాక్ కొట్టడంతో ఆపస్మారక స్థితి లోకి వెళ్లాడని తెలిపారు. విద్యుత్ షాక్ గురైన మడకం విజయ్ ని వెంటనే చికిత్స నిమిత్తం వెంకటాపురం లోని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. వెంకటాపురం వైద్యాధికారి మృతుడైన విజయ్ ని పరిశీలించి చనిపోయినట్టు నిర్ధారణ చేశారు.మృతుడి భార్య మడకం భాగ్యలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై కె తిరుపతి రావు తెలిపారు.

## జానహిత పాదయాత్రను విజయవంతం చేయాలి

- **డిసిసి అధ్యక్షులు కె శ్రీహరి రావ్**



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 01,(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర ఈనెల 3న ఖానాపూర్ నియోజకవర్గంలో చేపట్టనున్నారని డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆరోజు సాయంత్రం ఐదు గంటలకు బాదన్ కుర్తికి చేరుకొని పార్టీ జెండా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అనంతరం మరుసటి రోజు 4వ తేదీన శ్రమదానం, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో సిసి కెమెరాల ఏర్పాటు



**ఖానాపూర్ రూరల్ 1 ఆగష్టు (జనంసాక్షి):** ఖానాపూర్ పట్టణ లో ని శ్రీ నల్ల పోచమ్మ ఆలయం లో శుక్రవారం ఖానాపూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్ తన సొంత డబ్బులతో ఆలయంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ రక్షణకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగ పడుతుంది అని ఆలయ భద్రతకు తన వంతు సహాయంగా ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ఈశ్వర చారి ఉన్నారు.

## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఎండి అప్సర్ ఎన్నిక

- **వరుసగా మూడోసారి విజయం**



**కొత్తగూడ ఆగస్టు 1 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో ముసలమ్మా ఆటో యూనియన్ ఎన్నికలు నిర్వహించారు అధ్యక్షులు ఎండి అప్సర్‌ను వరుసగా మూడో సారి ఎన్నుకున్నారు.గతంలో రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఈసారి బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు.బ్యాలెట్ పద్ధతిలో సైతం విజయం సాధించడం జరిగింది.ఉపాధ్యక్షులు రెడ్యా,కార్యదర్శి రవికుమార్, కోశాధికారి నక్క నరేష్, గౌరవ అధ్యక్షులు పాకాల స్వామి లను ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమం యూనియన్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కాచం కృష్ణమూర్తి వర్ధంతి



**పాలకుర్తి, అగస్టు 01(జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి 19వ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటి సభ్యుడు చిట్యాల సోమన్న, సోమ సత్యం మాట్లాడారు, రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని రజాకర్లను తరిమికొట్టిన గొప్ప నాయకుడు కృష్ణమూర్తి అని అన్నారు. అనాడు కమ్యూనిస్టులు చేసిన పోరాటం ఇప్పటికి చిరస్మరణీయమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని పోరాటం చేయాల్సిన బాధ్యత నేటి యువతరానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగతల నాగరాజు, సారయ్య, అబ్బాస్, సందీప్, పరమేశ్వరీ, సోమక్క, వెంకన్న, వెంకటమ్మ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాలకుర్తి విద్యార్థిని ఎంపిక



**పాలకుర్తి, ఆగస్టు 01( జనంసాక్షి):** ఈ నెల 3, 4 తేదిల్లో హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దారావత్ గాయత్రి ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు శోభారాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల జనగాం జిల్లా కేంద్రంలోని దర్శకంచ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గాయత్రి 16 ఏళ్ల విభాగంలో 60 మీటర్ల దూరం పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. రాష్ట్ర స్థాయిఅథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన గాయత్రిని ఫిజికల్ డైరెక్టర్ మామిండ్ల సోంమల్లు, ఉపాధ్యాయులు బలరాం, అశోక్, రవి, సుమలత.అభినందించారు.

## రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి



**మల్హార్, ఆగష్టు 01(జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలం ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అజ్మీర భవాని ప్రసాద్ ఈనెల 3, 4 తేదీ నాడు జేఎన్ఎస్ హన్మకొండలో జరగబోయే 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 29వ తారీఖు నాడు జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యాడు. ఎంపికైన క్రీడాకారున్ని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ పూర్ణచంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ పక్కల రాజబాబు, ఉపాధ్యాయులు సతీష్, రమేష్, నాగేశ్వరరావు, సారయ్య, మధుబాబు ,కిరణ్,తాజుద్దీన్, రాజేందర్, దేవేందర్,రాజేందర్, ప్రదీప్, విజయలక్ష్మి, లలిత,శైలజ అభినందించారు.

# విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భం దాల్చిన మహిళలకు పాటించవలసిన జాగ్రత్తలు, సమయానుసారంగా చేసుకోవలసిన పరీక్షలపై అవగాహన కల్పించాలని, పోషకాహార లోపం, రక్త హీనత ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి ఆరోగ్య స్థితి సాధారణ స్థితికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రులలో ప్రసవం చేసుకోవాలని గర్భిణులకు వివరించడంతో పాటు సాధారణ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించి, అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చే దిశగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులు వీలైనంత తొందరగా గృహ ప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ సత్వరం పనులు పూర్తి అయ్యేలా పని చేస్తేనే లక్ష్యాన్ని సాధించగలమన్నారు. గణపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని గృహ నిర్మాణ శాఖ పిడిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక ఎక్కడి నుండి తెస్తున్నారని అడిగారు ఇసుక ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాల్వపల్లి నుండి ఇసుక తెస్తున్నట్లు పిడి తెలిపారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పశు వైద్య శాలను తనిఖీ చేశారు. పశువుల చికిత్స కు వచ్చిన రైతులతో వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు స్టాకు ఉంచాలని, పశు వులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయాలని సూచించారు. పశు సంపదను కాపాడుకోవాలని తెలిపారు. అవసరమైన మందుల కొరకు ప్రతిపాదనలు ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ డిడిని సూచించారు. ఈ సందర్భంగా గొర్రెల వైద్య సేవలకు వచ్చిన రైతు జిల్లా కలెక్టర్ కు గొర్రె పిల్లను బహుకరించారు.వ్యాధులతో బాధ పడే ప్రజలు వైద్యుల సలహాలు, సూచనలతో మేరకు క్రమం తప్పక మందులు వాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

శుక్రవారం గణపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలకు వచ్చిన ప్రజలతో సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీ పేరేంటి అని గట్టయ్యను అడిగి తెలుసుకుని ఏమి సమస్య ఉంది, వైద్యులు మంచిగా చూశారా లేదా మందులు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీ అనే మహిళతో మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ తేలు కుట్టినందున వైద్య సేవలకు వచ్చానని తెలుపగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని వైద్యురాలు డాక్టర్ అల్లూరి అనూష కు సూచించారు. ఓపి రిజిస్టర్, స్టోర్ రూము ను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రాథమిక సహకార సంఘం ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసి ఎరువుల నిల్వలు పరిశీలించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు అవసరం మేర తీసుకోవాలని సూచించారు. ధరల పట్టిక, స్టాకు రిజిస్టర్ పరిశీలించారు. ఈ రోజు ఇప్పటి వరకు ఎంత మంది రైతులు యూరియా తీసుకున్నారని వివరాలు అడుగగా 13 మంది రైతులకు 30 బస్తాలు యూరియా ఇచ్చామని తెలిపారు. ఎరువులు, విత్తన దుకాణాలను నిత్యం పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు, స్టోర్ రూములను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు భూ భారతి దరఖాస్తులు. పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు. నోటీసు లు జారీ, విచారణ ప్రక్రియ, దరఖాస్తులు తిరస్కరణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరస్కరించిన దరఖాస్తు దారులకు కారణాలు తెలియచేయాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సందర్శనలో కార్యాలయానికి వచ్చిన వయోవృద్ధునితో ఏ సమస్య కొరకు వచ్చారని అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కు వినతి

**బైంసా, ఆగస్టు 01 (జనంసాక్షి) :** బైంసా పట్టణ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు రావుల రాము ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్ల సమస్య, నీటి సమస్య,వీధి లైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రానున్న వినాయక చవితి, పొలాల పండుగ, దుర్గామాత, విజయదశమి పండుగల దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రంలో బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పట్టణ ఉపాధ్యక్షుడు గాలి రాజన్న,బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ముళ్ళ వార్ అనిల్మా,జీ కౌన్సిలర్ అల్లెం దిలీప్, టౌన్ సెక్రెటరీ సందుల శంకర్, బిజెపి యువ నాయకులు న్యామతాబాద్ లింగోజి, తదితరులు పాల్గొన్నారు.

## నీతి ఆయోగ్ సూచించిన ఆరు అంశాలను చిట్టచివర ఉన్న గుత్తి కోయగూడాలకు చేరాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్.**



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 01(జనంసాక్షి) :** నీతి ఆయోగ్ సూచించిన ఆరు అంశాలను చిట్టచివర ఉన్న గుత్తి కోయగూడాలకు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు జిల్లా కన్నాయిగూడెం ఆకాంక్షా బ్లాక్, సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గుర్తించిన దేశంలోని 500 ఆకాంక్షా బ్లాకులలో (ఆస్పిరేషనల్ బ్లాక్స్) కన్నాయిగూడెం బ్లాక్ ఒకటి అని అన్నారు. సమిష్టి కృషి ఫలితంగా, అభివృద్ధి సూచికలలో గణనీయమైన ప్రగతిని సాధించామని తెలిపారు. “సంపూర్ణత అభియాన్” అంటే కేవలం లక్ష్యాలను చేరుకోవడం కాదు, ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో సంపూర్ణ అభివృద్ధిని సాధించడమని, ప్రభుత్వ అధికారులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరి సహకారంతోనే సాధ్యమైతదని అన్నారు. కన్నాయిగూడెం ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట నారాయణ, ఎంపిడిఓ అనిత, ఎంపీఓ సాజిద, నీతి అయోగ్ కో ఆర్డినేటర్ రవీష్ , ఎంఈఓ, ఎంఏఓ, మండల అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సిరికొండ పరామర్శ

**టేకుమట్ల ఆగస్టు 01 (జనంసాక్షి) :** టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన తిప్పనవేణి పోషాలు ఇటీవల ఎమ్మెల్సీ సరికొండ మధుసూదనాచారి సహకారంతో నిమ్స్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేసుకొని ఆరోగ్యంతో ఇంటికి రాగా, శుక్రవారం ఎమ్మెల్సీ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, పోశాలు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోశాలు కుటుంబ సభ్యులు, ఆపరేషన్ కోసం ఎల్ఓసి ద్వారా ఆర్థిక సాయం అందించడం పట్ల మధుసూదనాచారికి కృతజ్ఞతలు తెలిపారు.

**అభిమాన నాయకుడి కోసం తరలివచ్చిన ప్రజలు**

టేకుమట్ల మండలానికి పరామర్శ కోసం మధుసూదనాచారి వచ్చాడని విషయాన్ని తెలుసుకున్న మండలంలోని ఉద్యమకారులు, అభిమానులు, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో టేకుమట్లకు చేరుకొని, మీ పాలనలో టేకుమట్ల మండల కేంద్రంగా ఏర్పడడంతో పాటు అనేక గ్రామపంచాయతీల నుంచి వేల కోట్లతో అభివృద్ధి చేశారని, ప్రస్తుతం రాజకీయ నాయకులు లబ్ధి పొందుతున్నారు తప్ప గ్రామాల అభివృద్ధి చెందడం లేదని, అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని మళ్లీ మీరే రావాలని, మీరు వస్తేనే భూపాలపల్లి అభివృద్ధి బాటలో ప్రయాణిస్తుందని కోరారు.